# తానా అధ్యక్షుడిగా తోటకూర ప్రసాద్ ఎన్నిక



టొరంటో: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అధ్యక్ష ఎన్నికల్లో తోటకూర ప్రసాద్ గెలుపొందారు. తిపిర్నేని తిరుమలరావుపై 1,043 ఓట్ల మెజారిటీ సాధించిన తోటకూర ప్రసాద్ 2011 జూలై 4 నుంచి 2013 జూలై 4 వరకు తానా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఎన్నికల్లో గెలుపొందిన ఆయన ఈ ఏడాది జూలై 4 నుంచి రెండేళ్ల పాటు ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా సంఘంకు సేవలందిస్తారు. 2011 వరకు ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా బాధ్యతలు నిర్వహించిన అనంతరం పూర్తి స్థాయి అధ్యక్షునిగా కొనసాగుతారు.

ఏక్ నజర్ డాట్ కామ్ చీఫ్ ఆపరేటింగ్ అధికారిగా పనిచేస్తున్న తోటకూర ప్రసాద్ కమ్యునిటి నేతగా వివిధ హోదాల్లో సేవలందించారు. 1986లో అమెరికాకు వలస వచ్చిన ఆయన కృష్ణ జిల్లాలోని గన్నవరంలో జన్మించారు. ఢిల్లీ తెలుగు అకాడమీ నుంచి ఉత్తవం ప్రవాస భారతీయుడి అవార్డును 2002లో సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వంశీ ఆర్ట్స్ వారి సేవా నిధి అవార్డును ప్రముఖ కవి డా. సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా 2006లో అందుకున్నారు. అమెరికాలో ఉంటున్న వివిధ తెలుగు సంఘాలకు తోటకూర ప్రసాద్ తన సేవలు అందించారు.

## 2009–11 సంవత్సర మధ్య కాలానికి 'తానా' నూతన కార్యవర్గం

డాలస్, ఏప్రిల్ 23 : తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఇటీవల నిర్వహించిన సంస్థాగత ఎన్నికలలో 2009–11 సంవత్సర మధ్య కాల వ్యవధికి నూతన కార్యవర్గం ఎన్నికయింది. ఈ ఎన్నికల్లో ప్రస్తుతం 'తానా' కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ప్రసాద్ తోటకూర ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా ఎన్నికవగా, మధుసూదన్ చిగురుపాటి కెనడా రీజియన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. 2009–11 సంవత్సర మధ్య కాలవ్యవధిలో ప్రసాద్ తోటకూర సంస్థ ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా కొనసాగితే, 2011–13 వరకూ 'తానా' అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.